## క్లుప్తంగా

### ఆలయానికి రూ.50 వేలు విరాళం



సత్యనారాయణ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కొత్తపేట శ్రీ కల్యాణ వెంకటేశ్వర, జానకి రామాంజనేయ గౌరీ శంకర సాయి మందిరానికి నగరానికి చెందిన తుంపాల సత్యనారాయణ, శ్రీదేవి దంపతులు రూ.50 వేలు విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా దాత దంపతులను కమిటీ సభ్యులు దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆలయ ప్రధాన అర్చకులు చక్రవర్తుల ప్రకాశాచార్యులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో మహిళ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

### ఏఐటీయూసీకి బుచ్చిబాబు రాజీనామా

ఏలూరు (టూటౌన్): సీపీఐ అనుబంధ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు తన పదవికి రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామా పత్రాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్యకు పంపించారు. తన వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు బుచ్చిబాబు బుధవారం పేర్కొన్నారు.

### 10న సంక్షేమ సంఘం వార్షికోత్సవం



సంఘం వార్షికోత్సవ కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విశ్వబ్రాహ్మణ ఉద్యోగ, వ్యాపారుల సంక్షేమ సంఘం 10వ వార్షికోత్సవం ఆగస్ట్ 10న సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షులు అప్పలభక్తుల శివకేశవరావు (శివ శ్రీ) కార్యదర్శి లంకలపల్లి జగదీష్ తెలిపారు. ఈ మేరకు కరపత్రాన్ని బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో విడుదల చేశారు. వార్షికోత్సవంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు, విభిన్న రంగాల్లో అత్యున్నత స్థాయికి ఎదిగిన విశ్వబ్రాహ్మణ ప్రముఖులను సన్మానించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు లక్కోజు వెంకటేశ్వరరావు (కొండబాబు), సహాయ కార్యదర్శి కోడూరి రామకృష్ణ, పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు బొద్దూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల ఆందోళన పట్టించుకోని పాలకులు

- నెల రోజులుగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు
- జీఓ 36 ప్రకారం జీతాలివ్వాలని డిమాండ్

ఏలూరు (టూటౌన్): సమస్యల పరిష్కారం కోరుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు ఆందోళన బాట పట్టి నెల రోజులు కావస్తోంది. ఎన్ని ఆందోళనలు, నిరసనలు వ్యక్తంచేసినా, వినతులు ఇచ్చినా ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరసన దీక్ష చేపట్టారు. జీతాలు పెంచాలని టెక్నికల్, నాన్ టెక్నికల్ జీతాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నెల 15న నిర్వహించిన మున్సిపల్ కార్మికుల చలో విజయవాడ సందర్భంగా మున్సిపల్ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడం పట్ల కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తక్షణం సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాయి.

**సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలి**

2023 డిసెంబర్‌లో నిర్వహించిన 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలు ఎక్స్‌గ్రేషియా రూ.7 లక్షలకు పెంపు, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75,000, దహన సంస్కారాల ఖర్చులు రూ.20,000, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంపుదల వంటి అంశాలను తక్షణమే అమలు చేయాలని కార్మికులు కోరుతున్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

| కార్మికుల వివరాలు |
|---|
| పర్మినెంట్ కార్మికులు 250 |
| కాంట్రాక్టు 800 |
| స్కూల్స్ స్వీపర్లు 120 |
| క్లాప్ డ్రైవర్లు 60 |
| వీరిలో 250 మంది వరకు మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది |



పాత బస్టాండ్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు (ఫైల్)



కమిషనర్ భానుప్రతాప్‌కు వినతి పత్రం అందిస్తున్న కార్మికులు (ఫైల్)

**డిమాండ్లివి**

- కార్మికులకు జీఓ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500లు జీతాలు చెల్లించాలి
- షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి
- వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.75 వేలు, ఎక్స్‌గ్రేషియో రూ.7 లక్షలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు జీఓలు జారీ చేయాలి.
- రిటైర్మెంట్ అయిన, చనిపోయిన, అనారోగ్యం పాలైన వారి స్థానంలో వారి బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలి
- ఆప్కాస్ రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలి
- సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలి
- చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలి
- కిట్లు , భద్రతా సౌకర్యాలు అందించాలి

### టెక్నికల్ జీతాలు ఇవ్వాలి



మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు టెక్నికల్ జీతాలు ఇవ్వాలి. సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, పర్మినెంట్ చేయాలి, రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని గత కొంత కాలంగా ఆందోళనలు చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరం . తక్షణం మున్సిపల్ ఇంజినీరింగ్ సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి.

– బి.సోమయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్

### ప్రభుత్వం దిగొచ్చేవరకూ ఆందోళన



ప్రభుత్వం దిగొచ్చేంత వరకు మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల ఆందోళన కొనసాగుతుంది. ప్రపంచంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే నైపుణ్యం గల వారికి నైపుణ్యం లేని వారి కంటే తక్కువ జీతాలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన ఉధృతం చేసి అత్యవసర సేవలను సైతం నిలిపివేయాల్సి వస్తుంది.

– కానూరు సత్యనారాయణ, వాటర్ వర్క్స్ విభాగం నాయకులు, ఏలూరు

### హాస్టల్ విద్యార్థులకు వితరణ



విద్యార్థులకు సాయం అందిస్తున్న ఆఫీసర్లు

దెందులూరు: హాస్టల్ విద్యార్థులు 45 మందికి పాలగూడెం సాల్వేషన్ ఆర్మీ సంఘం కోర్ ఆఫీసర్ గేరా జాన్, గేర రత్నమణి సంఘ సభ్యులు ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం సాల్వేషన్ ఆర్మీ ఏలూరు డివిజనల్ కమాండర్ మేజర్ యేసు రాజ్యం లతమ్మకు నగదును కోర్ ఆఫీసర్లు సంఘ సభ్యులు అందజేశారు.

### 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలంలో ఈ నెల 18న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ అంబేద్కర్ తెలిపారు. పాలగూడెం, సాయి నగర్, తూర్పులాకులు, కొమడవోలు, ఆటోనగర్, ఇందిరమ్మ కాలనీ, ఎన్‌టీఆర్‌నగర్, చెంచుల కాలనీ, శాస్త్రి కాలనీ, శ్రీరాంనగర్ కాలనీ, నాగేంద్ర కాలనీ, మస్తాన్ మస్యం కాలనీ, మారుతీ నగర్, రామ నగర్, అందాలమ్మ తోట, దుర్గా గ్రాండ్ సిటీ, హమాలీ కాలనీ, చాటపర్రు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

## ● ముక్కలైన మహావృక్షం

పర్యావరణాన్ని కాపాడండి అంటూ ఉపన్యాసాలిచ్చే ప్రజాప్రతినిధులు, అధికారులు ఏళ్ల నాటి భారీ చెట్లను నరికేస్తున్నా పట్టించుకోవడంలేదనడానికి ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో మెయిన్ గేటుకు పక్కనే ఉన్న మహావృక్షం నేలకొరగడమే నిదర్శనం. ఇది ఎవరికి అడ్డువచ్చిందో తెలియదు. ఎంతో మందికి నీడనిచ్చే ఆ మహా వృక్షాన్ని ముక్కలు ముక్కలుగా నరికేసిన దృశ్యాలివీ.

– సాక్షి ఫొటోగ్రాఫర్ / ఏలూరు



క్రెయిన్ సాయంతో వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం



మహావృక్షాన్ని ముక్కలుగా నరికేసిన దృశ్యం



మహావృక్షలే సాక్షి

## మున్సిపల్ కార్మికుల అరెస్టు అక్రమం



3వ సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మునిసపల్ కార్మికులు

ఏలూరు (టూటౌన్): సమస్యల పరిష్కారం కోరుతూ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టిన మున్సిపల్ కార్మికులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాసరావు ఖండించారు. ఏలూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయం 3వ సర్కిల్ వద్ద బుధవారం నిర్వహించిన మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్సిపల్ ఇంజినీరింగ్, కార్మికుల వేతనాలను పెంచాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య, ఇంజినీరింగ్ విభాగం కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. సమావేశంలో యూనియన్ ఉపాధ్యక్షుడు దొడ్డిగర్ల నాగబాబు, నగర ఉపాధ్యక్షుడు బంగారు దుర్గాప్రసాద రావు, యూనియన్ సభ్యులు వంశీ, సోమధుల మల్లేశ్వరరావు, దుర్గారావు, బంగారు అంకమ్మ, అర్జీ సత్యవతి, తోట శాంతి, బంగారు కుమారి, పెందుర్తి రమణమ్మ, పాట్లూరు సురేష్, మాదుగుల దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాల వర్తింపునకు కృషి



బిషప్ రాజును సన్మానిస్తున్న పాస్టర్లు



బిషప్ జాన్‌ను సత్కరిస్తున్న పల్లెం ప్రసాద్, ప్రేమ్‌బాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దళిత క్రైస్తవులందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేయడానికి కృషి చేస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ చర్చిస్ (ఏపీసీసీ) అధ్యక్షుడు బిషప్ జాన్ ఎస్‌డీ రాజు స్పష్టం చేశారు. విజయవాడలో గత మంగళవారం నిర్వహించిన ఏపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశంలో సంఘ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బిషప్ జాన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను బుధవారం నగరంలోని ఐసీఎం చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీఎం సంఘాల పాస్టర్లు, ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ సందర్భంగా బిషప్ జాన్ మాట్లాడుతూ ఏపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు దళిత క్రైస్తవుల హక్కుల పరిరక్షణకు పాటుపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ చర్చిల్ డేనియల్, ఎస్ జాన్ లియో, ఆర్ రవి కుమార్, డి.యోబు, ఏసురత్నం , ఆర్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

**బిషప్ జాన్‌కు సత్కారం**

దెందులూరు: ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా ఏలూరు ఐసీఎం బిషప్ జాన్ ఎస్‌డీ రాజు ఎన్నికయ్యారు. బుధవారం ఐసీఎం చర్చిలో ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ పల్లెం ప్రసాద్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి ప్రేమ్ బాబు ఆయనను శాలువా బొకేలతో సత్కరించారు. జ్ఞాపకను అందజేశారు.

# హామీల అమలు మోసపూరితం

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్
- ఏలూరులో బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు మోసపూరితమని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ విమర్శించారు. ఏలూరు నగరంలోని 40, 41, 42 డివిజన్ల పరిధిలో వైసీపీ కార్పొరేటర్ తుమరాడ స్రవంతి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేతలు బాబూస్ మేనిఫెస్టో రీకాలింగ్ క్యూఆర్ కోడ్ ఫ్ల కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం సూపర్ 6 హామీలను సైతం అమలు చేయలేక చేతులెత్తేసిందని, ఇంకా మేనిఫెస్టోలో ఉన్న మరో 143కి పైగా హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. టీడీపీ, జనసేన అధినేతలు సంతకం చేసిన హామీ పత్రాలకు విలువలేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మహిళలు సంతోషంగా ఉంటే, నేడు కూటమి పాలనలో వారు చేతిలో డబ్బులు లేక తీవ్ర ఆర్థిక కష్టాల్లో కూరుకుపోయారని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ ఎప్పుడు ప్రకటిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీఎంగా ఐదు నెలల కాలంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ఏకంగా ఒకేసారి 1 లక్షా 24 వేల ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. కార్పొరేటర్ స్రవంతి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో మహిళల ఆర్థిక స్వావలంబనకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, డ్వాక్రా మహిళలకు సున్నా వడ్డీకి రుణాలు, ఉపాధి కల్పనకు భారీగా బ్యాంకు రుణాలు అందజేశారని తెలిపారు. సొంత ఇంటిని సైతం అక్కా చెల్లెమ్మల పేరుతోనే అందజేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు కొప్పుల రంగబాబు, యుగంధర్‌ప్రసాద్, సాగు శ్రీను, దాసరి ప్రసాద్, నక్కా సూరిబాబు, మహేష్, బత్తుల సతీష్, ఉమాశంకర్, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు నెరుసు చిరంజీవి, బీసీ సెల్‌నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంటా మోహనరావు (జీఎంఆర్), పార్టీ నాయకులు కొల్లిపాక సురేష్, దాసరి రమేష్, యువజన నాయకులు దాలి వెంకటేష్, సాయి ప్రదీప్, బండ్లమూడి సునీల్‌కుమార్, బసవ, సత్యనారాయణ, తులసీ వర్మ, స్థానిక నాయకులు, మహిళలు ఉన్నారు.



ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న పార్టీ సమన్వయకర్త జయప్రకాష్, నాయకులు



యువతతో మాట్లాడుతున్న జయప్రకాష్

## పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పరిస్థితులు, అవసరాలకు అనుగుణంగా పరిశోధనలు చేస్తే విజయవంతం అవుతారని ఐఐటీ గౌహతికి చెందిన ప్రొఫెసర్ డి.పాము అన్నారు. స్థానిక సెయింట్ థెరెసా మహిళా స్వయంప్రతిపత్తి కళాశాలలో బుధవారం భౌతిక, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన అతిథి ఉపన్యాస కార్యక్రమంలో ఆయన డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ ఫర్ బయో మెడికల్ అప్లికేషన్స్ అనే అంశంపై ప్రసంగించారు. బయోమెడికల్ రంగంలో ఉపయోగించే పదార్థాలు మానవ శరీరానికి అనుకూలంగా ఉండాలన్నారు. బయో పాలిమర్స్, నానో మెటీరియల్స్, బయో కాంపోజిట్ అనేవి వివిధ వైద్య రంగాల్లో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. పరిశోధనలో మెకానికల్, ఎలక్ట్రికల్, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, జీవశాస్త్రం, నానో టెక్నాలజీని అనుసంధానం చేసి వినూత్న ప్లేట్లను ఆయన తమ ప్రయోగశాలలో తయారు చేసినట్టు చెప్పారు. ఈ పరిశోధనలో విద్యార్థి పాత్రను ఎంతో ప్రశంసించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీల రాణి, రసాయన శాస్త్ర విభాగాధిపతి సీఏ జ్యోతిర్మయి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి కె.శ్రీలత, అధ్యాపకులు, ద్వితీయ సంవత్సర విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

**ఏసీ బస్సులు..**

| బస్సు రూటు | సమయం | అందుబాటులో ఉన్న సీట్లు |
|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర) | 21.00 | 35 |
| ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర) | 21.30 | 34 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి) | 22.00 | 42 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్) | 22.30 | 23 |
| ఏలూరు – అమరావతి (ఇంద్ర) | 19.00 | రద్దు |

**సూపర్ లగ్జరీ**

| బస్సు రూటు | సమయం | సర్వీస్ నంబర్ | అందుబాటులో 22సీట్లు |
|---|---|---|---|
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ | 21.45 | 4820 | 29 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ | 21.15 | 4822 | 31 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట | 19.30 | 4796 | 27 |
| ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం | 10.45 | 4798 | 30 |
| ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం | 21.15 | 4802 | 33 |
| ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం | 21.00 | 4804 | 30 |
| ఏలూరు –ఈసీఐఎల్ | 22.30 | 4814 | 23 |
| ఏలూరు – తిరుపతి | 16.00 | 4830 | 34 |

### మానవ అక్రమ రవాణాపై అవగాహన



మానవ అక్రమ రవాణాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏలూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు రైల్వేస్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీస్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, చైల్డ్‌లైన్ 1098, బచపన్ బచావత్ ఆందోళన్, చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ సీఐ బెన్నియ్య, ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్, ఆర్‌పీఎఫ్ ఎస్సై బి.దనుష్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ వైవీ రాజు, క్రాప్ కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్, జి.రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

### తివాచీ పరిశ్రమను ప్రోత్సహించండి



తివాచీని మంత్రి మనోహర్‌కు అందిస్తున్న ప్రతినిధులు

ఏలూరు(మెట్రో): ఏలూరు నగరానికి ప్రసిద్ధి చెందిన తివాచి పరిశ్రమకు తగిన ప్రోత్సాహం అందించి తివాచి పరిశ్రమను ఆదుకోవాలని ఏలూరు కార్పెట్ సంస్థకు చెందిన ప్రతినిధులు పౌర సరఫరాల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ని కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం పీ–4 కార్యక్రమం అనంతరం విజయవాడ బయలుదేరుతున్న మంత్రి మనోహర్‌కి ఏలూరు కార్పెట్ సంస్థకు చెందిన మహమ్మద్ ఇంతియాజ్ అహమ్మద్ తన సంస్థ ద్వారా నేసిన తివాచీలను చూపించారు. ప్రస్తుతం తివాచి పరిశ్రమ అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని, ఏలూరులోని తివాచి పరిశ్రమకు పూర్వవైభవం వచ్చేలా తోడ్పాటు అందించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఇంతియాజ్ అహమ్మద్ తెలిపారు.

### స్మార్ట్ మీటర్ల విధానాన్ని విరమించాలి

కుక్కునూరు: స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ వివిధ పార్టీల ఆధ్వర్యంలో కుక్కునూరులో బుధవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సీపీఐ, సీపీఎం, వైఎస్సార్ సీపీ, కాంగ్రెస్, సీపీఐ ఎం ఎల్ ప్రజాపంథా నాయకులు పాల్గొన్నారు.